క్లుప్తంగా

నేతన్నలకు అండగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: చేనేత కార్మికులకు అండగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. కార్మికులకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఇస్తోందని, ప్రతి ఒక్కరూ చేనేత దుస్తులు ధరించి కార్మికులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ ఉషారాణి, కృష్ణయ్య, సురేంద్ర, విజయ్‌, రామ్మూర్తి, మణి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు పన్ను రద్దు చేయరూ!



మాట్లాడుతున్న సుబ్రమణ్యం

పుంగనూరు: విశ్రాంత ఉద్యోగులకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధి సుబ్రమణ్యం కోరారు. సోమవారం సంఘ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి గురురాజారావు అధ్యక్షతన నిర్వహించారు. సుబ్రమణ్యం మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్‌ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని, అలాగే జెఎస్‌ఈలో విశ్రాంత ఉద్యోగులకు సభ్యత్వం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు చెంగారెడ్డి, దొరస్వామి, గంగులమ్మ, వెంకటపతి, రామయ్య, రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

11న మండల సమావేశం

శాంతిపురం: మండల పరిషత్‌ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ వసుంధర అధ్యక్షతన నిర్వహించనున్నామని ఎంపీడీఓ హేమమాలిని సోమవారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడికి జైలు



ముద్దాయి హేమంత్‌తో ఎస్‌ఐ మోహన్‌కుమార్‌

పుంగనూరు : పట్టణంలో ద్విచక్రవాహనాలను చోరీ చేసిన కేసులో నిందితుడు హేమంత్‌కు 16 నెలల జైలు శిక్ష విధిస్తూ పుంగనూరు అడిషినల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి సింధు తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ మోహన్‌కుమార్‌ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లెలోని ఎస్టేట్స్‌కు చెందిన సుధాకర్‌ కుమారుడు హేమంత్‌ (20) గత ఏడాది అక్టోబర్‌లో రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వాదోపవాదాలు పరిశీలించిన న్యాయమూర్తి ఒక్కో కేసులో 8 నెలల చొప్పున నిందితుడికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఆడికృత్తికకు ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్‌: ఆడికృత్తిక మహోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నుంచి తిరుత్తణికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చిత్తూరు టూ డిపో అసిస్టెంట్‌ మేనేజర్‌ అల్తాఫ్‌ తెలిపారు. మంగళవారం భరణి, బుధవారం ఆడికృత్తికలో భాగంగా 20 బస్సులు కేటాయించగా రోజుకు 80 ట్రిప్పులు తిప్పుతామన్నారు. టూ డిపో బస్టాండు ఆవరణలో ఇందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. 50 మంది భక్తులుంటే గ్రామానికే బస్సు పంపుతామన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య

- కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్‌: జిల్లాలోని ప్రైవేట్‌ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యకు అనుమతివ్వాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోకనాథం, అశోక్‌కుమార్‌ కోరారు. ఈ మేరకు చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ నాయకులు సోమవారం కలెక్టర్‌ షణ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘ నాయకులు కలెక్టర్‌తో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాహక్కు చట్టం కింద జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యకు అనుమతివ్వాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉచిత విద్యకు అనుమతినిచ్చారని తెలిపారు. జిల్లాలో మొదటి సమావేశంలో అక్రిడిటేషన్లు మంజూరు కాని జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల విధులు నిర్వహించే జర్నలిస్టులకు పోస్టల్‌ బ్యాలెట్‌ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. కలెక్టర్‌ స్పందిస్తూ జర్నలిస్టుల పిల్లల ఉచిత విద్య అంశంపై డీఈవోతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



లబ్ధిదారురాలికి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన చేస్తోందని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. సోమవారం మండలంలోని దాసార్లపల్లె, కురప్పల్లె, బనకందొడ్డి, బట్టందొడ్డి, అండిగానిపల్లె, కొత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 632 గృహాలకు వెళ్లి ఆయా ఇళ్లలోని వారిని పలకరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలు పొందిన వివిధ పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. అర్హులైనప్పటికీ సాంకేతిక కారణాలతో పథకాల ఫలాలు అందని వారిని గుర్తించి, వారికి వర్తించేలా చేయడానికి, సమస్యల పరిష్కారానికి తాను పర్యటిస్తున్నట్లు స్పష్టం చేశారు. గతంలో ప్రతి చిన్న పనికీ తాము మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, కొన్నిసార్లు రోజుల తరబడీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ అగచాట్లు తప్పాయని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేకు చెప్పారు. ఇంటి ముంగిటకే అన్నీ అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

బట్టందొడ్డిలోని ఇనుప కరెంటు స్తంభానికి వర్షాకాలంలో కరెంటు సరఫరా అవుతోందని, దీనిని మార్చాలని, గ్రామంలో సిమెంటు రోడ్లు వేయాలని, మురుగునీటి కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే అండిగానిపల్లెకు పక్కా రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కరెంటు స్తంభాన్ని మార్చాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.

ప్రజలకు మేలు చేస్తున్నా ప్రతిపక్షాల దుష్ప్రచారం

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమర్థవంతమైన పాలనతో ప్రజలకు మేలు చేస్తున్నా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తూనే ఉన్నాయని మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, సంక్షేమం, అభివృద్ధికీ సమ ప్రాధాన్యత ఇస్తున్న జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, పెద్దపంజాణి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌ బాగారెడ్డి, వైస్‌ ఎంపీపీ ఆంజమ్మ, సింగిల్‌విండో చైర్మన్‌ ఓబుల్‌ రెడ్డి, మాజీ చైర్మన్‌ శంకరప్ప, మండల రైతు సంఘం అధ్యక్షుడు వెంకటరమణా రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్‌ పృథ్వి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్‌, ఎంపీడీఓ భాస్కర్‌, తహసీల్దార్‌ లోకేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్‌లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్‌, స్థానిక సర్పంచ్‌ అర్చన, ఎంపీటీసీ గురుమూర్తి, వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

రామాపురం, గడ్దూరు, జంగాలపల్లె, నిడిగుంట గ్రామాలలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారు.

గద్దర్‌కు నివాళి



పెద్దపంజాణి: గద్దర్‌ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



పుంగనూరులో..



పలమనేరు : శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రజా సంఘాలు



పలమనేరు : గ్రంథాలయంలో..



కుప్పంలో...

పెద్దపంజాణి: ప్రజా గాయకుడు గద్దర్‌ మృతి రెండు తెలుగు రాష్ట్రాలకు తీరనిలోటని మాల మహానాడు మండలశాఖ అధ్యక్షులు మంజు నాథ్‌ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సోమ వారం పెద్దపంజాణిలో గద్దర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు ఆయన సేవలను స్మరించారు. కార్యక్రమంలో తిప్పయ్య, తిరువలప్ప, అమర నారాయణ, జయప్ప, రంగప్ప, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: ప్రజాగాయకుడు, విప్లవ ఉద్యమకారుడు గద్దర్‌ మృతికి పలువురు నివాళులు అర్పించారు. సోమవారం మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఆశోక్‌, రాజు, మాజీ ఎంపీపీ నరసింహులు ఆధ్వర్యంలో గద్దర్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఉద్యమాల సూరీడు అని సేవలను కీర్తించారు. ఆయన మరణం ఉభయ తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. నాగరాజ, పెంచుపల్లి కృష్ణప్ప, శ్రీనివాసులు, భాస్కర్‌, రెడ్డి, కమ్మినాగరాజు, చిన్నప్ప, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: గద్దర్‌ మరణం విప్లవ సాహిత్యానికి తీరని లోటని గ్రంథాలయాధికారి హేమకుమార్‌ సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. ఇదే కార్యక్రమాన్ని పట్టణంలోని పలు ప్రజాసంఘాలు నిర్వహించాయి. కొంతసేపు మౌనం పాటించాయి. మానవ హక్కుల సంస్థ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: కుప్పంలో గద్దర్‌ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నివాళులు అర్పించారు. ఆయన ఆత్మశాంతికి మౌనం పాటించారు.

మృతుని కుటుంబానికి బీమా సాయం



వైఎస్సార్‌ బీమా సాయం అందజేస్తున్న సర్పంచ్‌ మురళీకృష్ణ

రామకుప్పం: స్థానిక శివాజీనగర్‌ కాలనీకి చెందిన పి.గోపినాథ్‌(45) ఇటీవల హఠాన్మరణం చెందాడు.. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరఫున వైఎస్సార్‌ బీమా మంజూరైంది. సోమవారం మృతుని కుటుంబానికి రూ.10 వేలను స్థానిక సర్పంచ్‌ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకట రవిప్రసాద్‌ అందజేసారు. మిగిలిన రూ.90 వేలను మృతుని భార్య బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వారు చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అబ్దుల్‌, గంగోజమ్మ, వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ నిత్యానంద, సచివాలయ సెక్రటరీ యువరాజు, గణేష్‌ రెడ్డి పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో కుంభాభిషేక పూజలు



బైరెడ్డిపల్లె: మండలంలో తీర్థం సమీపంలోని శ్రీ కాళభైరవేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కుంభాభిషేకం పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి తద్వారా సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదిగేలా చూడాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. సోమవారం మండల సమాఖ్య కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ మాట్లాడారు. సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలు మెరుగు పరచుకోవాలని సూచించారు. అనంతరం మండల సమాఖ్య పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అరుణ, ఉపాధ్యక్షురాలిగా హేమలత, కార్యదర్శిగా సునీత ఎన్నికయ్యారు. మధుసూదన్‌, చంద్రమోహన్‌, లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

పీఎల్‌ఆర్‌ వాలీబాల్‌ పోటీల్లో విజేత పాండిచ్చేరి

పుంగనూరు: పీఎల్‌ఆర్‌ వాలీబాల్‌ టోర్నమెంట్‌ పోటీల్లో పాండిచ్చేరి క్రీడాకారులు విజేతగా నిలిచి ట్రోఫీని, రూ.50 వేల నగదును గెలుచుకున్నారు. స్థానిక బీఎంఎస్‌ క్లబ్‌లో రెండు రోజుల పాటు జరిగిన వాలీబాల్‌ పోటీల్లో ప్రథమ బహుమతి పాండిచ్చేరి, ద్వితీయ బహుమతి (రూ.30 వేలు)ని బెంగళూరు, తృతీయ బహుమతి (రూ.20 వేలు)ని చెన్నై, నాలుగో బహుమతి (రూ.15 వేలు) పుంగనూరు జట్టు గెలుచుకుంది. ఈ పోటీలకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. విజేతలకు సోమవారం నగదు బహుమతులను సీమ జిల్లాల మైనార్టీ సెల్‌ ఇన్‌చార్జ్‌ ఫక్రుద్దీన్‌ షరీఫ్‌, మున్సిపల్‌ చైర్మన్‌ అలీమ్‌బాషా, క్లబ్‌ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా వక్ఫ్‌ బోర్డు చైర్మన్‌ అమ్ము, వాలీబాల్‌ క్రీడాకారుడు నానబాలగణేష్‌ తదితరులు అందజేశారు.


నులి పురుగుల నివారణ పోస్టర్లు ఆవిష్కరణ

రొంపిచెర్ల: ఈ నెల 10న నిర్వహించనున్న నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి కోరారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. అధికారులతో కలిసి ఆయన నులి పురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆస్పత్రిలో ఫర్నీచర్‌ కొరత ఉందని వైద్యులు ఎంపీపీ దృష్టికి తేవడంతో ఆయన స్పందించారు. వీటి ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు నులి పురుగుల మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర, తహసీల్దార్‌ అమరనాథ్‌, ఎంఈఓ శ్రీనివాసులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ సరళ, డాక్టర్లు రిజ్వాన్‌, దినేష్‌ నాయక్‌, సీహెచ్‌ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్‌ ఢీకొని యువకుడు మృతి

- మరో ఇద్దరికి గాయాలు





సుధాకర్‌ మృతదేహం, గాయాలతో చికిత్స పొందుతున్న మంజుల

చౌడేపల్లె: మోటార్‌ సైకిల్‌ ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని ఆమినిగుంట సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. ఆమినిగుంటకు చెందిన జయప్ప కుమారుడు ఆర్‌. సుధాకర్‌(30), చందు స్నేహితులు. వీరిద్దరూ కలిసి ఆమినిగుంట నుంచి అజ్జప్పల్లె వైపు మార్గంలో రోడ్డుపక్కన వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఈమార్గం నుంచి ఆమినిగుంట వైపు బైక్‌పై నగేష్‌ తన తల్లి మంజులతో పొలం నుంచి చౌడేపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యలో బైక్‌ సుధాకర్‌ను ఢీకొనడంతో తలకు అక్కడికక్కడే మృతిచెందాడు. నగేష్‌, మంజుల గాయపడ్డారు. స్థానికులు వారిని 108 సహాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. సుధాకర్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనవడి మరణంతో అనాథ అయిన వృద్ధురాలు

రోడ్డుప్రమాదంలో సుధాకర్‌ మృతి చెందడంతో అవ్వ వెంకటమ్మ (అమ్మమ్మ) అనాథగా అయ్యింది. మూడేళ్ల క్రితం అనారోగ్యంతో సుధాకర్‌ తల్లి మృతి చెందడంతో అతడి తండ్రి జయప్ప రెండో వివాహం చేసుకుని బిడ్డలను వదిలి వెళ్లిపోయాడు. అప్పటినుంచి అమ్మమ్మ వెంకటమ్మ వద్ద ఉండేవాడు. సుధాకర్‌ పెయింటింగ్‌, కూలీ పనులతోపాటు ఆటోడ్రైవర్‌గా వెళ్తూ వచ్చిన సంపాదనతో అమ్మమ్మను పోషించేవాడు. నాయనా! వదలి వెళ్లిపోతివా? ఇక నాకు దిక్కెవరు దేవుడా.. అని గుండెలవిసేలా ఆ వృద్ధురాలు రోదిస్తుండటం పలువురిని కంటతడి పెట్టించింది.



ప్రమాదంలో మృతి చెందిన వృద్ధుడు

సదుం మండలంలో వృద్ధుడు..

సదుం: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని మారుతివారిపల్లెకు చెందిన పెద్దబ్బ(70) భట్టువారిపల్లె సమీపంలోని కావమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్నాడు. అతడు ఆలయ సమీపంలో నడచి వెళ్తుండగా కల్లూరు నుంచి సోమలకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న మోహన్‌కుమార్‌ అదుపు తప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో పెద్దబ్బ గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.



గుడివంక వళ్లీదేవ సేన సమేత సుబ్రమణ్యస్వామి రథం లాగుతున్న భక్తులు

గుడుపల్లె: గుడివంక వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో సోమవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారిని ప్రత్యేక అలంకరణంతో ముస్తాబు చేశారు, రథాన్ని రంగ రంగుల పుష్పాలు, పచ్చని తోరణాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ స్వామివారిని రథంలో కొలువుదీర్చారు. అనంతరం భక్తుల హరో హరా.. మురుగా అని నామస్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆలయం చుట్టూ రథాన్ని ప్రదక్షిణలుగా లాగారు. ఇలాచేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. తర్వాత ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రత్యేక పూజలో జెడ్పీ చైర్మన్‌ శ్రీనివాసులు

గుడివంక శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామిని జెడ్పీ చైర్మన్‌ శ్రీనివాసులు(వాసు) దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ చైర్మన్‌ సుబ్రమణ్యం స్వాగతం పలికారు. అభిషేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కల్యాణం.. కమనీయం



సోమల : ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సోమల: మండల కేంద్రం సమీపంలోని బంగారు తిరుత్తణి కొండపై ఉన్న శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో ఆడికృతిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి అమ్మవార్లను అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల హోరు, వేద మంత్రోచ్చరణ నడుమ హోమం చేసి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారికి మంగళ హారతులు సమర్పించారు. స్వామి వారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి దర్శించుకున్నారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శీలం బాస్కర్‌,సోమల మాజీ సర్పంచ్‌ శ్రీరాములు, నిర్వాహకులు పూల మురళీకృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి భరణి, కృత్తిక వేడుకలు

వి.కోట: మండలంలోని ఆళ్వారిపల్లె, సీవీఆర్‌కొండపై మంగళ, బుధవారాల్లో భరణి, కృత్రిక కావడి పూజలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు, గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలనంతరం భరణి కావడి మొక్కులు, అలాగే బుధవారం ప్రత్యేక అభిషేకాలనంతరం కృత్తిక కావళ్లు చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమాలకు వి.కోట నుంచి మండలంలోని ఆళ్వారిపల్లె క్రాస్‌, నాయకనేరి, దుర్గంకొండ ఆలయాలకు భక్తుల సౌకర్యార్థం దాత రామచంద్రనాయుడు (మాజీ ఎంపీపీ) సహకారంతో రెండ్రోజులపాటు కేఆర్‌పి ట్రావెల్స్‌ బస్సులను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో..

చౌడేపల్లె: స్థానిక శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వళ్లీదేవ సమేత శ్రీషణ్ముఖ సుబ్రమణ్య స్వామికి మంగళవారం నుంచి రెండు రోజులపాటు ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కమలాకర్‌ తెలిపారు. మంగళవారం భరణి కావళ్లు, బుధవారం కృత్తిక కావళ్లు చెల్లించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మంగళవారం కల్యాణోత్సవం, బుధవారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను నెమలి వాహనంపై ఊరేగింపు నిర్వహించనున్నట్టు చెప్పారు.

విజలాపురంలో 'మిషన్‌ ఇంద్రధనస్సు' ప్రారంభం



పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రామకుప్పం: మిషన్‌ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌డీపీ(ఫ్యామిలీ డాక్టర్‌ ప్రోగాం) జిల్లా నోడల్‌ అధికారి డాక్టర్‌ సందీప్‌, విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అల్తాఫ్‌ హుస్సేన్‌ కోరారు. మండలంలోని విజలాపురం పీహెచ్‌సీలో సోమవారం మిషన్‌ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలు టీకాలు వేయించాలన్నారు. పిల్లలను గుర్తించి వారికి టీకాలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్‌ సాదియా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మిషన్‌ ఇంద్రధనస్సు కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు విధిగా టీకాలు వేయించుకోవాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పవిత్ర కోరారు. పట్టణంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం టీకాలు వేసే కార్యక్రమాన్ని పవిత్ర లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. వైద్య, అభివృద్ధి, విద్య, ఐసీడీఎస్‌ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమంలో సర్పంచ్‌ చెంగమ్మ తదితరులు

మొక్కలు నాటారు

పలమనేరు: పర్యవరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని కూర్మాయి సర్పంచ్‌ చెంగమ్మ అన్నారు. సోమవారం మండలంలోని కూర్మాయి పాఠశాలలో ఒక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల పంచాయతీ 4 వార్డు మెంబరు ఎన్నికల కోసం అభ్యర్థుల నుంచి నామినేషన్లు మంగళవారం స్వీకరించనున్నట్లు రిటర్నింగ్‌ అధికారి కేశవరెడ్డి సోమవారం తెలిపారు. మూడురోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పోటీ చేయదల చిన అభ్యర్థులు నామినేషన్లను ఎంపీడీఓ కార్యాలయంలో రూం నంబర్‌1లో ఇవ్వాలన్నారు.

3 వార్డులకు ఉప ఎన్నికలు

శాంతిపురం: వివిధ కారణాలతో మండలంలో వార్డు సభ్యులు లేని 3 వార్డులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. కడపల్లె పంచాయతీలో 10వ వార్డు, దండికుప్పం పంచాయతీలోని 3వ వార్డు, మఠం పంచాయతీలోని 10వ వార్డులకు ఉప ఎన్నికలు జరుగుతాయన్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఆయా వార్డులకు అమలులో ఉన్న రిజర్వేషన్లు యథావిధిగా అమలులో ఉంటాయని చెప్పారు. ఈ నెల 19న నిర్వహించే ఎన్నికలకు సంబంధించి పోటీ చేయదలచిన అభ్యర్థులు 10వ తేదీలోపు నామినేషన్లను దాఖలు చేయాలన్నారు.

రామకుప్పం మండలంలో..

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ 6 వ వార్డు ఉప ఎన్నిక నిర్వహణకు నోటిఫికేషన్‌ విడుదలైనట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్ల స్వీకరణ, 14న నామినేషన్ల ఉప సంహరణ, 19న ఒంటిగంట వరకు పోలింగ్‌, సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు.

పార్కు పనుల పరిశీలన



పార్కు పనులను పరిశీలిస్తున్న చైర్మన్‌ అలీమ్‌బాషా, కమిషనర్‌ నరసింహ ప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: పట్టణంలోని పుంగమ్మ చెరువు వద్ద నిర్మిస్తున్న పార్కును అతి సుందరంగా ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్‌ చైర్మన్‌ అలీమ్‌బాషా తెలిపారు. సోమవారం కమిషనర్‌ నరసింహ ప్రసాద్‌ రెడ్డి, జిల్లా వక్ఫ్‌ బోర్డు చైర్మన్‌ అమ్ముతో కలసి పార్కు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణ ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో సేదదీరేందుకు మంత్రి డాక్టర్‌ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్కు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. అలాగే ఎన్‌ఎస్‌.పేట రహదారిని విస్తరించి, వినాయకస్వామి గుడి వెనుక భాగం నుంచి ముళబాగిల్‌కు వెళ్లేలా అనుసంధాన రోడ్డును వేస్తామన్నారు. పట్టణ రూపురేఖలు మార్చేందుకు సుమారు రూ.50 కోట్లతో ఎంబీటి రోడ్డు విస్తరణ ప్రారంభమైందని, అలాగే రూ.22 కోట్లతో కౌండిన్య నది కాలువల్లో పూడికతీసి, సిమెంటు లైనింగ్‌ పనులు ప్రారంభించినట్లు చైర్మన్‌ తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌ బోర్డు డైరెక్టర్‌ ఖాన్‌, నాయకులు ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.